19న వరల్డ్ పద్మశాలి ఫౌండేషన్ రజతోత్సవ మహోత్సవాలు

హిమాయత్‌నగర్, మార్చి16: సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వరల్డ్ పద్మశాలి ఫౌండేషన్ రజతోత్సవ మహోత్సవాలను ఈ నెల 19న సికింద్రాబాద్‌లోని హరిహర కళా భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ గజం నరసింగరావు తెలిపారు. ఆ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాల ఆవిష్కరణ ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలాదిమందికి విద్య, వైద్య, తదితర రంగాల్లో తమవంతు తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. వంద ఉచిత వివాహ పరిచయ వేదికలను పూర్తిచేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఈ మహోత్సవంలో గత విజయాలను గుర్తు చేసుకోవడంతోపాటు భవిష్యత్‌లో చేయాల్సిన అంశాలపై చర్చించి కార్యచరణ రూపొందిస్తామన్నారు. ఈ వేడుకలకు గవర్నర్ జిష్ణుదేవ వర్మ, మంత్రి కొండా సురేఖ, మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, తదితరులు హాజరుకానున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ సభ్యులు ఎస్.శ్రీనివాస్, గుంటి మోహన్‌రావ్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు

ఖైరతాబాద్, మార్చి 16 : ఏషియల్ ఈఎన్టీ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 19న వరల్డ్ స్వాలోయింగ్ డేను పురస్కరించుకొని సోమాజిగూడలోని ఆస్పత్రిలో డైస్ఫేగియా నిర్ధారణ, చికిత్సపై 30 మంది ఆడియాలజిస్టులకు ఉచిత శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఈ తరగతులను ఈఎన్టీ వైద్యనిపుణులు డాక్టర్ చావ ఆంజనేయులు ప్రారంభించారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అయిషా, డాక్టర్ నీలిమా, డాక్టర్ సంజన తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై స్పెషల్ డ్రైవ్..

- ఎండలు పెరుగుతుండడంతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ
- పీహెచ్‌సీలతోపాటు జన సామర్థ్యం ఉన్న ప్రాంతాల్లో ఓఆర్ఎస్ కార్నర్లు
- లేబర్ అడ్డాల్లో వేచి ఉండే కార్మికులపై స్పెషల్ ఫోకస్

మార్కెట్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుభాన్

జూబ్లీహిల్స్, మార్చి 16: ఎండల తీవ్రత పెరుగుతుండడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. శ్రీరామ్ నగర్ క్లస్టర్ పరిధిలోని అన్ని పీహెచ్‌సీలలో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. మండుతున్న ఎండలకు ముందస్తు జాగ్రత్తలే ముఖ్యమని భావించి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. సమ్మర్ స్ట్రోక్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వేసవిలో ఎండల వేడిమిని తట్టుకునేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో జన సామర్థ్యం ఉండే ప్రాంతాల్లో తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం తో పాటు సన్ స్ట్రోక్‌కు గురయ్యే వారిని కాపాడేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దినసరి పనుల కోసం లేబర్ అడ్డాలలో వేచి ఉండే కార్మికులపై స్పెషల్ ఫోకస్ పెడుతున్నారు. మార్చి నుంచి జూన్ నెలాఖరు వరకు భవన నిర్మాణ పనులు చేసే కార్మికులకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా లేబర్ అడ్డాలతో పాటు బస్ స్టాప్‌లు, మార్కెట్‌లు, పోలీస్ స్టేషన్‌లలో, కూడళ్లలో ఓఆర్ఎస్ కార్నర్‌లు ఏర్పాటు చేసినట్లు శ్రీరామ్ నగర్ ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ బి.విజయ నిర్మల తెలిపారు. జూబ్లీహిల్స్ పీహెచ్‌సీ పరిధిలో 13, శ్రీరామ్‌నగర్‌లో 40, వినాయక్ నగర్‌లో 26, బోరబండలో 59 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో సమ్మర్ స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం..

సమ్మర్‌ను దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అన్ని పీహెచ్‌సీలతోపాటు జన సామర్థ్యం ఉన్న ప్రాంతాల్లో ఓఆర్ఎస్ కార్నర్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఆశ వర్కర్స్, వైద్య సిబ్బంది భవన నిర్మాణ కార్మికులకు అవగాహన కల్పించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఓఆర్ఎస్ కార్నర్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఈ నాలుగు నెలలు భవన నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు ఎండలో పనులు, వ్యాపారాలు చేయడం తగ్గించుకోవాలి. ఆయా వర్గాల ప్రజలు ఓఆర్ఎస్‌ను వెంట ఉంచుకోవాలి.

– ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ విజయ నిర్మల, శ్రీరామ్ నగర్ క్లస్టర్

సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి

జర్నలిజంలో స్వీయ నియంత్రణ అవసరం

రౌండ్ టేబుల్ సమావేశంలో వ్యక్తులు

ఖైరతాబాద్, మార్చి 16: జర్నలిజంలో స్వీయ నియంత్రణ ఎంతో అవసరమని , జర్నలిస్టులను నియంత్రించే అవకాశాన్ని ప్రభుత్వాలకు ఇవ్వవద్దని వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమ జర్నలిస్టు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'సోషల్ మీడియా భాష సమంజసమేనా...?, సోషల్ మీడియా పార్లమెంటరీ భాష, స్వీయ నియంత్రణ' అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ .. చరిత్ర చాలా భయంకరమైందని... పాఠాలు నేర్చుకోకపోతే పునరావృతమవుతుందన్నారు. జర్నలిస్టులకు ప్రత్యేక హక్కులు ఉన్నాయన్న అపోహలు వీడాలని, అందరికీ భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని, కానీ బూతు ప్రకటన స్వేచ్ఛ ఉండవద్దన్నారు. సమాజంలో నాల్గవ స్తంభంగా ఉన్న జర్నలిస్టులు మిగతా మూడు స్తంభాలు కూలిపోకుండా రక్షించేదిగా భావించేవారని, కానీ అందరి కంటే ముందే కూలిపోయే స్థితికి చేరిందని అభిప్రాయపడ్డారు. అది వైఫల్యమేనని అనుకోవాలన్నారు. ప్రస్తుతం కొన్ని మాధ్యమాలన్నీ కొందరు పెట్టుబడిదారుల చేతుల్లో చిక్కుకొని ఉన్నాయన్నారు. అమెరికా లాంటి దేశాల్లో అధ్యక్ష ఎన్నికల్లో ఓ పెట్టుబడిదారి ప్రభావం ఉందన్నారు. మీడియాను నియంత్రించే వెసులుబాటు ప్రభుత్వాలకు కల్పిస్తే అది ప్రమాదకరమైందని, మిగతా అందిరిపై ప్రభావం పడుతుందన్నారు. ఇప్పటికే ఐటీ నిబంధనలు వచ్చాయని గుర్తు పెట్టుకోవాలన్నారు. మరిన్ని చట్టాలు తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతుందన్నారు. దీనిపై విస్తృత చర్చ జరగాలన్నారు. అలాగే జర్నలిజంలో స్వీయ నియంత్రణ ఎంత అవసరమో రాజకీయ పార్టీలకు సైతం ఆ నియంత్రణ ఉండాలని, అదే డిమాండ్ కావాలన్నారు. సీపీఐ నేత చాడా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం మీడియా కంటే సోషల్ మీడియా వ్యాప్తి చెందుతోందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతున్న తరుణంలో సోషల్ మీడియా విస్తరిస్తుందన్నారు. మీడియాకు తప్పని సరిగా స్వేచ్ఛ ఉండాలని, హద్దులు ఉండాలన్నారు. నేడు సోషల్ మీడియాలో ఫేక్ సమాచారం ఆందోళన కలిగిస్తుందన్నారు. దీనిని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ ఉద్యమ జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు రహమాన్, సీనియర్ జర్నలిస్టులు శ్రీనివాస్, వేణుగోపాల్, పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్రసేన్ కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం

బంజారాహిల్స్ రోడ్ నం.12లో నూతనంగాఏర్పాటు చేసిన అగ్రసేన్ కో ఆపరేటివ్ బ్యాంక్ 7వ బ్రాంచ్‌ను ఆదివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ ప్రమోద్‌కుమార్ కేడియా, అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు మున్నాలాల్ అగర్వాల్, భగవతి బాల్వా, తదితరులు పాల్గొన్నారు.

– బంజారాహిల్స్,మార్చి 16

ఘనంగా శ్రీ పోచమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, పద్మశాలిపురం శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ 7వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ పూజల్లో మాజీ కార్పొరేటర్ టి.ప్రేమ్‌దాస్‌గౌడ్, ధనుంజయ్, టి.ప్రేమ్‌గౌడ్, కాశీగారి యాదగిరి, ఎం.వెంకటేశ్, బొల్ల శ్రీనివాస్, వెంకటేశ్, గట్టయ్య, శ్రీనివాస్, డి.వి.కుమార్, ఏర్వ సత్యనారాయణ, యంజాల శేఖర్, యంజాల మహేశ్‌రాజ్, సీతారామ్, మహిపాల్ , తదితరులు పాల్గొన్నారు.

– మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 16

పేద రోగులకు కార్పొరేట్ వైద్యం అందించాలి

ఖైరతాబాద్, మార్చి 16 : పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందించాలనే లక్ష్యంతో కొనసాగుతున్న వాసవి హాస్పిటల్ సేవలను మరింత విస్తృత పర్చాలని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్ కోరారు. ఖైరతాబాద్‌లోని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కొత్తూరు జయప్రకాశ్ రామ్, ప్రధాన కార్యదర్శిగా కొండ్లె మల్లికార్జున్, కోశాధికారిగా దయాకర్ గుప్తా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. నూతన కార్యవర్గం పేద రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, వాసవి హాస్పిటల్ జీవిత కాలం గౌరవ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, మాజీ టూరిజం శాఖ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, పద్మశ్రీ రమేశ్, దిడిగె జయంత్, జయదేవ్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన గంజాయి ముఠా

ఖైరతాబాద్, మార్చి 16 : గంజాయి ముఠా పోలీసులకు చిక్కింది. ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘ టన జరిగింది. సీఐ రాజశేఖర్ వివరాల ప్రకారం....ఖైరతాబాద్ చౌరస్తాలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. రెండు ద్విచక్ర వాహనాలపై ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ మీదుగా చౌరస్తాకు వస్తున్న త్రిపుల్ రైడర్లను ఆపి .. హ్యాండిల్‌కు ఉన్న సంచులను పరిశీలించగా అందులో గంజాయి ఉంది. దీంతో వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. విచారణలో నిజామాబాద్ జిల్లా ఎర్గట్లకు చెందిన ననుబాల సురేశ్, ఉప్పల్ పీర్జాదిగూడకు చెందిన కాసి రాహుల్, అల్వాల్, యాప్రాల్‌కు చెందిన హెల్చల్ భానుచందర్, నిజామాబాద్‌లోని ఎర్గట్ల, భీమ్‌గల్‌కు చెందిన శీలం ప్రవీణ్ కుమార్, పసుల నితిన్, నిజాంపేట నడిగడ్డ తండాకు చెందిన డోల డేవిడ్, కొత్తగూడెంకు చెందిన మధు (గంజాయి పెడ్లర్) ముఠాగా ఏర్పడి గంజాయి సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ననుబాల సురేశ్‌పై టేకులపల్లి, బానుచందర్ బాచుపల్లి, శీలం ప్రవీణ్‌పై జగద్గిరిగుట్ట, పసుల నితిన్‌పై భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిలో గంజాయి పెడ్లర్ మధు పరారీలో ఉన్నాడని తెలిపారు. నిందితుల వద్ద నుంచి 1.182 కిలోల గంజాయి, రెండు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.3,500 నగదు స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధిని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు రాఘవేందర్‌యాదవ్

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 16: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి ప్రజల దృష్టిని మళ్లించాలని ప్రయత్నిస్తుందని బీఆర్ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు అక్కెం రాఘవేందర్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 15 నెలలు గడుస్తున్నా కూడా అభివృద్ధిపై దృష్టిసారించకుండా పిచ్చి చర్యలు చేస్తూ కాలం వెల్లదీస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీలు అంటూ ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. గతంలో సచివాలయం ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అంతేకాకుండా దళితులకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనేక పథకాలు అమలు చేసిందని అన్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి దళితులపై కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. రాబోయే సర్పంచ్, జెడ్‌పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమవుతున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు ఐటీ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. కాంగ్రెస్ నాయకులకు కనీసం ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను పరిష్కరించే సమయం కూడా లేదన్నారు. ప్రజల వద్దకు వెళ్తే ఆరు హామీలపై ప్రజ లు ఎక్కడ తమను ప్రశ్నిస్తారేమో అని చేతగాని వారిలాగా పిరికి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయడం ఖాయమన్నారు.

ఉద్యమాలను అణిచివేస్తే విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదు..

హిమాయత్ నగర్ , మార్చి16: ఓయూలో ఎలాంటి ఆందోళనలు, ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించవద్దని ఓయూ ఉప కులపతి, రిజిస్ట్రార్ జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వంద ఏండ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వ విద్యాలయం ఎన్నో పోరాటాలకు, త్యాగాలకు నిలయంగా ఉందని, అలాంటి ఆవరణలో ఆంక్షలు విధించడం సరైన విధానం కాదన్నారు. ప్రజా పాలన అంటూనే విద్యార్థుల హక్కులను హరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమానికి పురిటిగడ్డగా నిలిచి ఎంతో మందిని సమాజానికి పరిచయం చేసిన ఘనత ఓయూకు ఉందని, ఓయూ ఉప కులపతి, రిజిస్ట్రార్ ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తూ విద్యార్థి ఉద్యమాలను అణిచివేస్తే విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు..!

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 16: ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు వాటిని ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, వినాయక్‌నగర్ బస్తీలో సర్వే నంబర్ 115/1లో సుమారు 400 గజాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించారు. రాత్రికి రాత్రి రూమ్‌లు, ప్రహారీ నిర్మించారు. నకిలీ దస్తావేజులు సృష్టించి..వాటిని మార్కెట్‌లో విక్రయాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తమ కేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడి ప్రజల ఉపయోగార్థం వినియోగించాల్సిన కోట్లాది రూపాయల స్థలాలను కబ్జాదారుల చేతుల్లో పెడుతున్నారని ప్రజలు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను కూల్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

మాదిగల రిజర్వేషన్లకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలి

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మోహన్‌రావు

ఎమ్మార్పీఎస్ రిలేనిరాహార దీక్షకు మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మోహన్‌రావు, తదితరులు

శంషాబాద్ రూరల్, మార్చి 16 : మాదిగల రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం శంషాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు చిట్టిబాబు, మద్దిలేటిల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ ..మాదిగల రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కొంతకాలంగా మాదిగలకు రిజర్వేషన్లు కల్పిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ... ఇప్పుడు వాటిని అమలు చేయడంలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన వెంటనే మాజీ సీఎం కేసీఆర్ రిజర్వేషన్ల కోసం ప్రత్యేక అసెంబ్లీ తీర్మానం చేసి ఢిల్లీకి పంపారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్ల పట్ల దోబూచులాడుతూ జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్ కల్పించకుండా కొన్ని వర్గాలను మోసం చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినా వాటిని అమలు చేయకుండా కేవలం గత ప్రభుత్వంపై నిందలు మోపుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. త్వరలో కాంగ్రెస్‌కు ప్రజలు తగ్గిన బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. మద్దతు ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ జయమ్మ, బీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్, లీగల్‌సెల్ అధ్యక్షుడు కొన్నమొల్ల శ్రీనివాస్, చిన్న గండు రాజేందర్, గూడెపు అశోక్, చెన్నకేశవులు, మహేశ్‌యాదవ్, లింగం శ్రీశైలం, రాములు, రైస్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాలకు పూల అలంకరణ చేయాలని తీర్మానం

బోరబండ బాబా సాహెబ్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

ఎర్రగడ్డ, మార్చి 16: వచ్చే నెలలో జరగనున్న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న అ న్ని అంబేద్కర్ విగ్రహాలను బల్దియా ఆధ్వర్యంలో పూల అలంకరణ చేయాలని కోరు తూ వివిధ సంఘాలు తీర్మానించాయి. అంబేద్కర్ యువజన సంఘం బోరబండ డివిజన్ అధ్యక్షుడు ఏడీ మధు, ఆలిండి యా సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి ల క్ష్మయ్య, తదితరులు ఈ విషయమై ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్‌ను ఇటీవల కలిసి వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే.. వెంటనే బల్దియా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు లేఖ రాశారు. నియోజకవర్గంలోని అన్ని అంబేద్కర్ విగ్రహాలకు పూల అలంకరణ చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోరబండ వీకర్ సెక్షన్‌లోని బాబా సాహెబ్ విగ్రహం వద్ద సంబురాలు జరుపుకొన్నారు. ఏడీ మధు మాట్లాడుతూ.. త్వరలో జోనల్ కమిషనర్‌ను కలిసి నియోజకవర్గంలోని అంబేద్కర్ విగ్రహాల వివరాలను అందజేస్తామని పేర్కొన్నారు. సంబురాల్లో లక్ష్మయ్య, కుమార్, వెంకటాద్రి, హ న్మంతరావు, కురుమయ్య, వెంకటేశ్, కేశవులు, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి..

అమ్మ ఆసరా ఆశ్రమంలో వృద్ధులు, మానసిక వికలాంగులకు భోజనం అందజేస్తున్న మానవ సేవే మాధవ సేవా సంస్థ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 16: సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవుతూ పేదలను ఆదుకోవాలని మానవ సేవే మాధవ సేవా సంస్థ చైర్మన్ ఏర్వ కుమారస్వామి అన్నారు. ఆదివారం చెంగిచర్ల మేడిపల్లిలో గల అమ్మ ఆసరా ఆశ్రమంలో వృద్ధులు, మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఆశ్రమ నిర్వాహకులు మేఘన్, విజయలక్ష్మి, శివలను సంస్థ ప్రతినిధులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. సమాజంలో సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. వృద్ధులు, మానసిక వికలాంగులకు అండగా ఉంటూ వారికి కావాల్సిన సదుపాయాలను కల్పించేందుకు ముందుకు రావాలన్నారు. ప్రేమ, ఆదరణ అందిస్తూ వారికి భరోసా కల్పించాలన్నారు. సంస్థ డైరెక్టర్లు కొంపల్లి జగదీశ్, గొంత్యా ల శ్రీనివాస్, దినేశ్, హేమలత, లక్ష్మి, అనిత పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న పెట్రోల్ దొంగలు

వెంగళరావునగర్, మార్చి 16 : పెట్రోల్ దొంగలు పెట్రేగిపోతున్నారు. రాత్రి వేళల్లో ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైకుల్లోని పెట్రోల్‌ను దొంగలు అపహరించుకెళ్తున్నారు. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంగళరావునగర్ కాలనీలో అర్ధరాత్రి దాటాక స్కూటీ, మోటారు సైకిల్‌పై వచ్చిన దొంగలు బైకుల్లోని పెట్రోల్‌ను బాటిళ్లల్లో నింపుకుని వెళ్తున్నారు. పెట్రోల్ తీసిన తర్వాత పైపును అలాగే వదిలేయడంతో పెట్రోల్ వృథాగా రోడ్డుపై పోతుంది. ఉదయం చూసుకుంటే బైకులోని పెట్రోల్ అంతా ఖాళీ అవుతుంది. శనివారం అర్ధరాత్రి దాటాక మోటారు సైకిల్‌పై వచ్చిన యువకులు పెట్రోల్ చోరీకి పాల్పడ్డారు. ఇదంతా ఇక్కడి సీసీ కెమెరాల్లో రికార్డ్ అయింది. ఇప్పటికైనా రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ పెంచాలని, పెట్రోల్ దొంగలను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మత సామరస్యాన్ని చాటిన ఇఫ్తార్..

బోరబండ డివిజన్, స్వరాజ్‌నగర్‌లో జరిగిన ఇఫ్తార్ విందు మత సామరస్యాన్ని చాటింది. స్థానిక రాక్స్ టౌన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన విందుకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు విజయకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లిం సోదరులకు వివిధ మతాలకు చెందిన వాళ్ళు సేవలను అందించారు. స్కూల్ హెచ్ఎం పాఖ్యవతి, సిబ్బంది, బస్తీ వాసులు పాల్గొన్నారు.

– ఎర్రగడ్డ, మార్చి 16

పనికి వెళ్లివచ్చేసరికి ఆభరణాలు మాయం

బంజారాహిల్స్,మార్చి 16: పనికి వెళ్లివచ్చేసరికి ఇంట్లో ఆభరణాలు మాయమయిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.2 లోని ఇందిరానగర్‌ను ఆనుకుని ఉన్న క మలాపురి కాలనీలో హ్యాపీ కిడ్స్ స్కూల్ లో హౌజ్ కీపింగ్ పనిచేస్తున్న మేకా శ్రావణి భర్తతో కలిసి పనికోసం బయటకు వెళ్లి సాయంత్రం తిరిగివచ్చింది. ఇం ట్లో పూజ చేయాల్సి ఉండగా అల్మారాలోని ఆభరణాలు వేసుకోవడానికి చూడ గా అందులో